సాక్షి నిజామాబాద్

మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు.

- 8లో ▸



గ్రామాల్లో స్టీల్ బ్యాంకులు..

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ భూతాన్ని తరిమేందుకు గ్రామాల్లో స్టీల్ బ్యాంకులు ఏర్పాటవుతున్నాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.4 /22.5

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

దిశ సమావేశం 23కు వాయిదా

డొంకేశ్వర్(ఆర్మూర్): ఈ నెల 16న ఎంపీ ధర్మపురి అర్వింద్ అధ్యక్షతన జరగాల్సిన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం అనివార్య కారణాలతో 23వ తేదీకి వాయిదా పడినట్లు డీఆర్డీవో సాయాగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దిశ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

పోలీస్ ప్రజావాణికి 23 ఫిర్యాదులు



ఖలీల్‌వాడి: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 23 ఫిర్యాదులు వచ్చాయి. కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయిచైతన్య ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.

వరల్డ్ బాక్సింగ్‌లో పతకాల పంట

- జిల్లాకు చెందిన కోచ్ ఎత్తేసామొద్దీన్ నేతృత్వంలో..



నిజామాబాద్‌నాగారం: ప్రపంచం బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన కోచ్ ఎత్తేసామొద్దీన్ నేతృత్వంలో మన దేశానికి చెందిన బాక్సింగ్ క్రీడాకారిణిలు జాస్మిన్, మీనాక్షి ఉదాలు బంగారు పతకాలు సాధించారు. నుపుర్ షియోరాన్ (రజతం), పూజా రాణి (కాంస్య) పతకాలు సాధించారు. ఇంగ్లాడ్‌లో ఈ నెల 4 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన వరల్డ్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో మొత్తం నాలుగు పతకాలుసాధించారు. భారత బాక్సింగ్ జట్టుకు కోచ్‌గా జిల్లాకు ఎత్తేసామొద్దీన్ వ్యవహరించడంతో జిల్లాకు చెందిన క్రీడాకారులు, క్రీడాభిమానులు ఆనందనం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాకు చెందిన బాక్సింగ్ క్రీడాకారులు, జాతీయస్థాయి అథ్లెట్, గోల్డ్ మెడలిస్టు సయ్యద్ ఖైసర్ ఎత్తేసామొద్దీన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నవీపేట మండలం నాళేశ్వర్ గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ కొద్ది రోజుల క్రితం నరాల నొప్పితో బాధపడుతూ నగరంలోని విజయ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చింది. అక్కడ న్యూరో ఫిజీషియన్ అందుబాటులో లేకపోవడంతో రిసెప్షనిస్టే ఆమె వద్ద రూ.400 ఫీజు వసూలు చేసి డాక్టర్ విష్ణువర్ధన్ పేరుతో టెస్టులు, స్కానింగ్‌కు రిఫర్ చేశాడు. వైద్యుడు పరీక్షించకుండానే టెస్టులు రాయడంతో లక్ష్మి అవాక్కైంది. దీనిపై ప్రశ్నించి నేరుగా డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. అయితే సదరు ఆస్పత్రికి ఉన్నతాధికారులు జరిమానా విధించి నామమాత్రపు చర్యలు తీసుకున్నారు.





స్కానింగ్ అంతా ప్లానింగ్

- వైద్యుల వద్దే రిఫరెన్స్ బుక్‌లు
- కమీషన్ ఎక్కువ ఇచ్చే స్కానింగ్ కేంద్రాలకు ప్రాధాన్యం
- మల్టీ..స్పెషాలిటీల పేరుతో దోపిడీ
- జిల్లాలో జోరుగా సాగుతున్న దందా

నిజామాబాద్‌నాగారం: అనారోగ్యం బారినపడి వైద్యుడిపై నమ్మకంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్న రోగులు 'ప్లానింగ్' చట్రంలో చిక్కుకుంటున్నారు. రోగి ఆస్పత్రిలో అడుగు పెట్టడమే ఆలస్యం సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్‌రే రిఫరెన్స్ బుక్‌లను బయటికి తీస్తున్నారు చాలా మంది వైద్యులు. ముందస్తు ప్లానింగ్ ప్రకారం తమకు కమీషన్‌లు ఇచ్చే

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు	550 కిపైగా
స్కానింగ్ సెంటర్లు	137
ఎక్స్‌రే	29
సీటీ స్కాన్	16
ఎంఆర్ఐ సెంటర్లు	04

సెంటర్లకు రిఫర్ చేస్తున్న డాక్టర్లు ఇష్టారీతిన దండుకుంటున్నారు. జిల్లా కేంద్రంతోపాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ పట్టణాల్లోనూ మల్టీ, సూపర్‌స్పెషాలిటీ పేర్లతో ఆస్పత్రులు వెలియగా స్కానింగ్ సెంటర్లూ ఏర్పాటయ్యాయి. నిజామాబాద్ నగరంలోనే 350కిపైగా ఆస్పత్రులు ఉండగా, ఆయా ప్రాంతాల్లో 200 వరకు ఉన్నాయి. ప్రతి ఆస్పత్రి నుంచి ఆర్థో, గైనిక్ అల్ట్రాస్కానింగ్, కిడ్నీలో రాళ్లు, కడుపు నొప్పి వంటి వాటికి స్కానింగ్, గాయాలకు ఎక్స్‌రే, దెబ్బలు పెద్దగా ఉంటే సీటీస్కాన్, ఎంఆర్ఐ అంటూ రిఫర్ చేస్తున్నారు. ఒక్కో రిఫరెన్స్‌పై సుమారు 30 శాతం నుంచి 40 శాతం వరకు కమీషన్‌లను స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు వైద్యులకు ముట్టజెప్పుతున్నారనేది బహిరంగ రహస్యం.

సూపర్, మల్టీ స్పెషాలిటీల్లో..

చిన్న చిన్న ఆస్పత్రులు ఏర్పాటు చేసుకున్న వైద్యులు పేదలకు తక్కువ ఫీజుతో వైద్య సేవలు అందిస్తూ మన్ననలు పొందుతుండగా, పదుల సంఖ్యలో వెలిసిన స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో రిఫరెన్స్ దందా జోరుగా సాగుతోంది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరినీ స్కానింగ్ సెంటర్లకు రిఫర్ చేస్తున్నారు.

మేమేం తక్కువ..

ఆర్‌ఎంపీలు, పీఎంపీలు సైతం స్కానింగ్, ఎక్స్‌రేలకు రిఫర్ చేస్తూ తామేం తక్కువ అన్నట్లు వ్యవహరిస్తున్నారు. స్కానింగ్ సెంటర్లలో వారి రిఫరెన్స్‌పై స్కానింగ్ చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. రిపోర్టులను చూస్తూ వచ్చీరాని వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

పర్యవేక్షణ అంతంతే

జిల్లా వైద్యారోగ్యశాఖ తనిఖీలు అంతంతగానే ఉండడంతో రిఫరెన్స్ దందా అడ్డూఅదుపు లేకుండా సాగుతోంది. పర్యవేక్షించాల్సిన డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఇతర కిందిస్థాయి అధికారులు ఎవరికి వారు యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో స్కానింగ్ పేరుతో దోపిడీ ఆగడం లేదు. ఇప్పటికైనా జిల్లా, ఉన్నత స్థాయి అధికారులు పక్కాగా పర్యవేక్షించాలని రోగులు, వారి కుటుంబాల సభ్యులు కోరుతున్నారు.

స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలి

- మూడు నెలలకోసారి తనిఖీలు చేయాలి
- అర్హత లేకుండా స్కానింగ్‌కు రిఫర్ చేయొద్దు
- డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: స్కానింగ్ కేంద్రాల పనితీరుపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులను, సలహా సంఘ సభ్యులను జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి రాజశ్రీ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ప్రతి స్కానింగ్ కేంద్రాన్ని తప్పకుండా మూడు నెలలకోసారి తనిఖీ చేయాలన్నారు. రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించి రూపొందించాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో తాగు నీరు, మూత్రశాలలు ఉండాలని, ధరల పట్టిక, ఐఈసీ, సమాచార సూచికలు, వేచి ఉండే గది అందుబాటులో ఉండాలన్నారు. అర్హత లేని వారు స్కానింగ్‌కు రిఫర్ చేయొద్దని, రేడియాలాజిస్ట్, గైనకాలజిస్ట్ లేకుండా స్కానింగ్ సెంటర్లను నిర్వహించే వారిపై చట్ట ప్రకారం చర్యలుంటాయని స్పష్టం చేశారు. కొత్తగా రెండు స్కానింగ్ సెంటర్లకు అనుమతులివ్వడంతోపాటు నాలుగు సెంటర్లకు రెన్యువల్ చేసినట్లు తెలిపారు. ఆర్మూర్ డివిజన్‌లో ఓ స్కానింగ్ కేంద్రాన్ని మూసివేయాలని సభ్యులు తీర్మానం చేశారు. సమావేశంలో పీవో పీసీఎన్‌డీటీ డాక్టర్ సుప్రియ, పీవో ఎంసీహెచ్ డాక్టర్ శ్వేత, సభ్యులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు, సభ్యులు

పకడ్బందీగా ఎస్‌ఐఆర్



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అడిషనల్ కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్

- పొరపాట్లు, తప్పిదాలకు తావుండొద్దు
- వీసీలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి సుదర్శన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)–2026 ప్రక్రియను అన్ని నియోజకవర్గాల పరిధిలో పకడ్బందీగా చేపట్టేందుకు సన్నద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి సూచించారు. కలెక్టర్, ఈఆర్‌వోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం ఆయన ఎస్ఐఆర్ ప్రక్రియపై మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) నుంచి ఆదేశాల వచ్చిన వెంటనే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను చేపట్టాలని, అందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. బీహార్ రాష్ట్ర సాధారణ ఎన్నికల దృష్ట్యా ఇప్పటికే ఆ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యిందని గుర్తు చేశారు. మన వద్ద సైతం ఎలాంటి పొరపాట్లు, తప్పిదాలకు తావులేకుండా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. 2002 ఓటరు జాబితాతో 2025 జాబితాను సరిపోల్చుకోవాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ నిర్వహణపై సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలకు శిక్షణ అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ టి వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, బోధన్, ఆర్మూర్, బాన్సువాడ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, కిరణ్మయి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పోషణ మాసం..

పిల్లల్లో పోషలోపాన్ని అధిగమించేందుకు పోషకాహారాన్ని అందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా, నిజాయితీగా పని చేయాలని కలెక్టర్ టి వినయ్‌కృష్ణారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి నిర్వహించనున్న పోషణ మాసం కార్యక్రమాన్ని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం సాయంత్రం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పోషణ మాసం కార్యక్రమాల అమలు తీరును సమీక్షించి, అధికారులకు సూచనలు చేశారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు పోషణ మాసాన్ని పక్కాగా నిర్వహించాలన్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపంపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. చిన్న పిల్లలు, మహిళల్లో పోషకాహార లోపాన్ని గుర్తించి పరిష్కరించడమే పోషణ మాసం ముఖ్య ఉద్దేశమని అన్నారు. డీఆర్డీవో సాయాగౌడ్, డీడబ్ల్యూవో రసూల్ బీ, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, డీఈవో అశోక్, ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌జర్లు పాల్గొన్నారు.

లేబర్ రేట్లు పెంచాలని పనుల నిలిపివేత



పవర్‌హౌస్ ఎదుట నిరసన తెలుపుతున్న కాంట్రాక్టర్లు


సుభాష్‌నగర్: లేబర్ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న అన్ని పనులను మంగళవారం నుంచి నిలిపేస్తున్నామని ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు పవర్‌హౌస్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. 2021లో ఉన్న లేబర్ రేట్లకు, ప్రస్తుతమున్న రేట్లకు వ్యత్యాసం ఉందని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని అన్నారు. ఈవిషయాన్ని పలుమార్లు సీఎండీ దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు మంగళవారం నుంచి పనులు ఆపేయాలని అసోసియేషన్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. పరిస్థితిని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి సమ్మెకు సహకరించి న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రవి యాదవ్, సంతోష్, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు మళ్లీ పోటెత్తిన వరద

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి రెండు లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- నిజాంసాగర్‌లోకి 38వేల క్యూసెక్కులు

బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం రాత్రి 7గంటలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద నీరు పోటెత్తింది. ఆదివారం నుంచి నిలకడగా లక్ష క్యూసెక్కులు వచ్చిన వరద సోమవారం సాయంత్రానికి లక్షా 33 వేల క్యూసెక్కులకు చేరుకుంది. రాత్రి ఇన్‌ఫ్లో లక్షా 51 వేల క్యూసెక్కులకు పెరగడంతో మొదట 26 వరద గేట్ల ద్వారా లక్షా 33 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మళ్లీ వరద పెరగడంతో రాత్రి 7 గంటలకు 36 వరద గేట్ల ద్వారా లక్షా 82 వేల క్యూసెక్కులకు నీటి విడుదలను పెంచారు. ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా 8 వేలు, కాకతీయ కాలువకు 4 వేలు, ఎస్కేప్ గేట్ల ద్వారా 5 వేలు, సరస్వతి కాలువకు 800, లక్ష్మికాలువకు 200, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 180, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 684 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం రాత్రి నిండుకుండలా ఉంది.



ఎస్సారెస్పీ నుంచి విడుదలవుతున్న నీరు



నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి మంజీరలోకి..

నిజాంసాగర్ నుంచి నాలుగు గేట్ల ద్వారా..

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 38,829 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 4 వరద గేట్ల ద్వారా 27,128 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నామన్నారు. ప్రధాన కాలువకు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా 1,404.72 అడుగుల(17.397 టీఎంసీలు) నీరు నిల్వ ఉందన్నారు.

ఈ ఏడాది 400 టీఎంసీలు..

- ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- పదేళ్లలో మూడోసారి అత్యధికం..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఈ ఏడాది వరద పోటెత్తింది. ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు 420 టీఎంసీల వరద వచ్చింది. గత పదేళ్లలో మూడో భారీ ఇన్‌ఫ్లోగా రికార్డుల్లోకి చేరింది. ప్రాజెక్టుకు వచ్చే ఇన్‌ఫ్లోను జూన్ నుంచి మే వరకు ఏడాదిగా లెక్కిస్తారు. ప్రస్తుత సంవత్సరం జూన్, జూలైలో పెద్దగా వరద రాకున్నప్పటికీ ఆగస్టు నుంచి పోటెత్తింది. ఇన్‌ఫ్లో అక్టోబర్ 28 వరకు కొనసాగే అవకాశం ఉంది. సుప్రీం తీర్పు ప్రకారం అక్టోబర్ 28న బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లను మూసివేస్తారు.

ఆగస్టులో అధికం..

ప్రస్తుత సంవత్సరం ఆగస్టులోనే అధికంగా 250 టీఎంసీల ఇన్‌ఫ్లో వచ్చింది. గత పదేళ్లలో ఆగస్టు నెలలో ఈ స్థాయి వరద రావడం ఇదే మొదటిసారి. ఈ నెలలో ఇప్పటి వరకు 142 టీఎంసీల వరద రాగా.. గత పదేళ్లలో ఇదే అధికం. జూన్‌లో 4 టీఎంసీలు, జూలైలో 24 టీఎంసీల ఇన్‌ఫ్లో వచ్చింది.

పదేళ్లలో భారీ వరద వచ్చిన సంవత్సరాలు..

సంవత్సరం	ఇన్‌ఫ్లో	అవుట్ ఫ్లో
2016 - 17	360.49	355.8
2020 - 21	371.91	382.84
2021 - 22	678.15	676.64
2022 - 23	595.25	594.15
2024 - 25 (ఇప్పటి వరకు)	420	351.37

బాధిత రైతులకు ఊరట

- పొలాల్లో ఇసుక మేటలు తొలగిస్తున్న ఉపాధి కూలీలు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటపొలాల్లో వేసిన మట్టి, ఇసుక మేటల తొలగింపు సోమవారం నుంచి మొదలైంది. ఎస్టిమేషన్లు వేసిన అధికారులు ఉపాధి కూలీల ద్వారా తొలగిస్తున్నారు. ఖర్చు లేకుండా ప్రభుత్వమే చర్యలు చేపట్టడంతో బాధిత రైతులకు కొంత ఊరట లభిస్తోంది.

జిల్లాలో మొత్తం 270 ఎకరా ల పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. వర్ని, వేల్పూర్, ఇందల్వాయి, ధర్పల్లి, భీ మ్‌గల్, సిరికొండ మండలాలు కలిపి 389 మంది రైతులు బాధితులుగా ఉన్నారు. వరికి ఎక్కువగా నష్టం వాటిల్లగా, జరిగిన నష్టం నుంచి కోలుకునే చర్యల్లో భాగంగా ప్రభుత్వం పొలాల్లో వేసిన ఇసుక, మట్టిని ఉపాధి కూలీల సహాయంతో తొలగింపజేస్తోంది. ఇటు ఉపాధి కూలీలకు కూడా పని లభిస్తోంది. వా రం, పది రోజుల్లోగా పొలాల్లోని ఇసుక, మట్టి మేటలను తొలగించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చామని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ తెలిపారు.



భీమ్‌గల్‌లో ఓ రైతు పొలంలోనుంచి ఇసుక మేటలను తొలగిస్తున్న ఉపాధిహామీ కూలీలు

మహిళా సంఘాల్లో నగదు రహిత లావాదేవీలు

నందిపేట్ (ఆర్మూర్): మహిళా సంఘాల్లో నగదు రహిత లావాదేవీలు నిర్వహించేందుకు జిల్లాలో పైలట్ మండలంగా నందిపేట్‌ను ఎంపిక చేశారు. సోమవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘం ప్రతినిధులు, అసిస్టెంట్లకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర సెర్ప్ అధికారి వెంకట్ మాట్లాడుతూ.. వీవో అధ్యక్షులు, సిబ్బంది డిజిటల్ లావాదేవీలపై చిన్న సంఘ సభ్యులందరికీ అవగాహన కల్పించాలన్నారు. గూగుల్ పే, ఫోన్‌పే నుంచి రోజుకు రూ. లక్ష వరకు, చిన్న మొబైల్ నుంచి రోజుకు రూ. 5000 వరకు లావాదేవీలు చేసుకోవచ్చని వివరించారు. రేపటి నుంచి అన్ని గ్రామాలలో అన్ని సంఘాలకు సీసీలు, సీఆర్పీలు, వీవోఏలు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్డీవో మధుసూదన్, డీపీఎం సంధ్యారాణి, జిల్లా సమాఖ్య పాలకవర్గ సభ్యులు, ఏపీఎం ఖాందేశ్ గంగాధర్, బ్యాంకు అధికారులు, సీసీలు, సీఆర్పీలు, వీవోఏలు, వీవో ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధికారి వెంకట్

నేడు డీఫార్మసీ స్పాట్ అడ్మిషన్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలోని డీ ఫార్మసీ కోర్సులో మిగిలిన సీట్లకు మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు మధ్యాహ్నం 3 గంటలకు కళాశాలలో హాజరుకావాలని, ఎంపీసీ, బైపీసీ చదివిన వారు దోస్త్ ద్వారా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 99597 49166 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

‘తైక్వాండో’ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారుడు



మోపాల్‌: ఏషియన్‌ ఓపెన్‌ ఇంటర్నేషనల్‌ తైక్వాండో చాంపియన్‌షిప్‌ పోటీల్లో బిగ్‌ ఫైటర్స్‌ తైక్వాండో హబ్‌ క్రీడాకారుడు కుమ్మరి మోక్షిత్‌ సత్తా చాటినట్లు మాస్టర్‌ నరహరి నాయక్‌ తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం చాంపియన్‌షిప్‌ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరహరి నాయక్‌ మాట్లాడుతూ మోక్షిత్‌ అద్భుతమైన ప్రతిభ కనబర్చాడన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయికి వెళ్లడం ఆనందంగా ఉందన్నారు. మోక్షిత్‌ విజయం సాధించడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేశారు.

రామన్నపేట్‌ వీడీసీ రద్దు

వేల్పూర్‌: వేల్పూర్‌ మండలం రామన్నపేట్‌ గ్రామాభివృద్ధి కమిటీని రద్దు చేసినట్లు వీడీసీ అధ్యక్షుడు గుమ్ముల కిషన్‌, ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌, క్యాషియర్‌ లింబాద్రి, సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీడీసీని రద్దు చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్‌ శ్రీకాంత్‌, ఎస్సై సంజీవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక నుంచి గ్రామంలో వీడీసీ ఉండదని వారు పేర్కొన్నారు.

ముగిసిన ఎంఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న ఎంఈడీ పరీక్షలు సోమవారం ముగియగా, ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం సెమిస్టర్‌ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఎంఈడీ 4వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, 1, 2, 3, 4వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షలలో మొత్తం 30 మందికి 28 మంది హాజరుకాగా ఇద్దరు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. తెయూ క్యాంపస్‌ కళాశాలలో జరిగిన ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం 4వ సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షల్లో మొత్తం 28 మందికి 26 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరైనట్లు ప్రొఫెసర్‌ చంద్రశేఖర్‌ తెలిపారు.

డబ్ల్యూహెచ్‌ఆర్‌ కౌన్సిల్‌ రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా లక్ష్మణ్‌



నిజామాబాద్‌నాగారం: సోషల్‌ జస్టిస్‌ ఫర్‌ వరల్డ్‌ హ్యూమన్‌ రైట్స్‌ కౌన్సిల్‌ రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా నీరడి లక్ష్మణ్‌ నియమితులయ్యారు. సోమవారం కౌన్సిల్‌ నేషనల్‌ చైర్మన్‌ కె విజయ్‌ కుమార్‌ నియామకపత్రాన్ని అందజేశారు. జిల్లాలో హ్యూమన్‌ రైట్స్‌ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌ కేసులో రెండు రోజుల జైలు

భిక్కనూరు: మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి న్యాయమూర్తి చంద్రశేఖర్‌ రెండు రోజుల జైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధించినట్లు భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు సోమవారం తెలిపారు. మెదక్‌ జిల్లా రామాయంపేట మండల కేంద్రానికి చెందిన స్వామి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో స్వామిని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా రెండ్రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

ప్లాస్టిక్‌ నిరోధానికి స్టీల్‌ బ్యాంకులు

- రెంజల్‌, తాడ్‌బిలోలి గ్రామాల్లో శ్రీకారం
- స్టీల్‌ ప్లేట్లను వినియోగిస్తున్న గ్రామస్తులు



స్టీల్‌ ప్లేట్లలో భోజనాలు చేస్తున్న స్థానికులు(ఫైల్‌)



రెంజల్‌లో స్టీల్‌ బ్యాంకు ఏర్పాటు చేసిన శివాజీ సేవా సమితి ప్రతినిధులు

రెంజల్‌(బోధన్‌): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌ భూతాన్ని తరిమేందుకు గ్రామాల్లో స్టీల్‌ బ్యాంకులు ఏర్పాటవుతున్నాయి. శుభకార్యాలు, అన్నదానాల్లో సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ ప్లేట్లలో భోజనాలు చేస్తుండడంతో అనారోగ్య సమస్యలు దరిచేరుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ వాడకాన్ని తగ్గించాలనే ఆలోచనతో రెంజల్‌ మండల కేంద్రంలో శివాజీ సేవా సమితి, తాడ్‌బిలోలి గ్రామంలో శ్రీరామాలయం కమిటీలు స్టీల్‌ బ్యాంకులను ఏర్పాటు చేశాయి. ఈ రెండు గ్రామాల్లో జరిగే శుభకార్యాలు, పెళ్లిళ్లలో సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ను తగ్గించే దిశగా కమిటీలు ముందుకెళ్తున్నాయి. ప్లాస్టిక్‌ ప్లేట్లకు బదులు స్టీల్‌ ప్లేట్లను వాడేలా కృషి చేస్తున్నాయి.

భయపెడుతున్న ప్లాస్టిక్‌ భూతం

జిల్లాలో ప్లాస్టిక్‌ భూతం భయపెడుతోంది. నిషేధిత సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. 120 మైక్రాన్‌లలోపు కవర్లు, గ్లాసుల నిషేధం అమలుకు నోచడంలేదు. 2022 జూలై నుంచి ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కానీ, వ్యాపారులు, ప్రజలు నిబంధనలు పాటించడం లేదు. మరోవైపు ప్లాస్టిక్‌ నిషేధాన్ని అమలు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. సూపర్‌ మార్కెట్లు, టిఫిన్‌ సెంటర్లు, కూరగాయల మార్కెట్లు, హోటల్స్‌, పానీపూరి, చిరు వ్యాపారులు, వైన్స్‌ల వద్ద పర్మిట్‌ రూంలు, స్వీట్‌ షాపులు, పండ్ల దుకాణాల తదితర వాటిల్లో తక్కువ మైక్రాన్ల కవర్లను వినియోగిస్తున్నారు. వాటిని వినియోగించే ప్రజలు రోగాలబారిన పడే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్‌ కవర్లు విక్రయించే వారికి భారీ మొత్తంలో జరిమానాలు విధించే అవకాశం ఉన్నా, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

అన్నదానాలకు ఇస్తున్నాం



ప్లాస్టిక్‌ వాడకంతో కలిగే అనర్థాలను గుర్తించి ఇటీవల ఆలయ కమిటీ ద్వారా 800 స్టీల్‌ ప్లేట్లు, గ్లాసులు తెప్పించాం. కేవలం ఆలయాల్లో నిర్వహించే అన్నదానాలకు ఉచితంగా అందిస్తున్నాం.

– కార్బానా శ్రీనివాస్‌, శ్రీరామాలయం కమిటీ చైర్మన్‌, తాడ్‌బిలోలి

ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకే..



ప్లాస్టిక్‌ ప్లేట్లు, గ్లాసుల వాడకాన్ని నియంత్రించేందుకు శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో 300 స్టీల్‌ ప్లేట్లు, గ్లాసులు తీసుకొచ్చాం. శుభకార్యాలకు ఉచితంగా అందిస్తున్నాం. స్టీల్‌ బ్యాంకు ప్లేట్లు, గ్లాసులు తీసుకున్న వారు చార్జీలు కాకుండా మరిన్ని స్టీల్‌ ప్లేట్లు అందించాలని సూచిస్తున్నాం. ఎవరినీ బలవంతం చేయడం లేదు.

– లక్ష్మణ్‌గౌడ్‌, రెంజల్‌ శివాజీ సేవా సమితి ప్రతినిధి

అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

- కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి
- ప్రజావాణికి 115 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్లు కిరణ్‌, అంకిత్‌ తదితరులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 115 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌ కుమార్‌, ట్రెయినీ కలెక్టర్‌ కరోలిన్‌ చింగ్తియాన్‌ మావీ, డీఆర్డీవో సాయాగౌడ్‌, నగరపాలక సంస్థ కమిషనర్‌ దిలీప్‌ కుమార్‌, మెప్మా పీడీ రాజేందర్‌, బోధన్‌ ఏసీపీ శ్రీనివాస్‌లకు వివరించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు.

రైతులను ఆదుకోవాలి



ధర్నా చేస్తున్న బోధన్‌ నియోజకవర్గ బీజేపీ నాయకులు, రైతులు

భారీ వర్షాలతో నష్టపోయిన బోధన్‌ నియోజకవర్గ రైతులను ఆదుకోవాలని బీజేపీ నాయకులు మోహన్‌రెడ్డితోపాటు రైతులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. నష్టపోయిన పంటలను అధికారులు గుర్తించి పరిహారం అందించాలని కోరారు.

అనర్హులను తొలగించాలి



ప్రజావాణిలో ఫిర్యాదు అనంతరం పత్రాలు చూపుతున్న గౌడ సంఘం సభ్యులు

భవానీ గీత పారిశ్రామిక సహకార సంఘంలో అనర్హులకు సభ్యత్వం ఇచ్చారని గీత కార్మికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సంఘానికి చెందిన స్వామి గౌడ్‌ సుమారు 15 మంది అనర్హులను సంఘంలో చేర్చుకున్నట్లు తెలిపారు. అర్హతలు లేని వారిని తక్షణమే నిబంధనల ప్రకారం తొలగించాలన్నారు.

దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్‌ ఎదుట నిరసన తెలుపుతున్న వన్నెల్‌(బి) గ్రామస్తులు

తోటలకు వెళ్లేందుకు దారి కోసం తమ భూమి ఇవ్వాలని కొందరు వ్యక్తులు ఇబ్బంది పెడుతున్నారని బాల్కొండ మండలం వన్నెల(బి) గ్రామానికి చెందిన కొందరు గ్రామస్తులు కలెక్టరేట్‌ ఎదుట నిరసన తెలిపారు. తమ భూమిలో నుంచి ఇతర కులస్తులు దారి తీసుకునేందుకు దౌర్జన్యం చేస్తున్నారని పేర్కొన్నారు. విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

వేతనాలు చెల్లించండి

రెండు నెలల వేతనాలను చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు కలెక్టరేట్‌ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి రమేశ్‌ మాట్లాడుతూ రెండు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు.

యూరియా బస్తా తెచ్చిన తంటా!

- యువ రైతుకు అవమానం

భిక్కనూరు: వరిపంట చిరు పొట్ట దశకు వచ్చింది. ఎక్కడా పంటకు యూరియా దొరకడం లేదు. ఓ పొలంలో కనిపించిన యూరియా బస్తాను తీసుకెళ్లాడు. ఈ పని ఆ రైతును తీవ్ర ఇబ్బందుల పాలు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన రైతు తక్కళ్ల గంగారెడ్డి తన వరి పంటకు అవసరమైన రెండు ఎరువుల బస్తాలను క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడి కొనుగోలు చేశాడు. మొదట తన వాహనంపై ఒక యూరియా బస్తాను తీసుకెళ్లి తన వ్యవసాయ క్షేత్రంలో పెట్టాడు. ఇంకో బస్తాను తీసుకొచ్చేందుకు వెళ్లాడు. అదే సమయంలో ఆ రోడ్డు వెంబటి బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు వ్యవసాయ క్షేత్రంలో యూరియా బస్తాను గమనించారు. అందులో ఓ యువకుడు తన పంట చిరు పొట్ట దశకు వస్తున్నదని, చల్లేందుకు యూరియా దొరకడం లేదని తన స్నేహితునికి పరిస్థితిని వివరించాడు. దీంతో ఇద్దరు యువకులు కలిసి యూరియా బస్తాను బైక్‌ పై పెట్టి, అది కనిపించకుండా మక్క కంకుల చొప్పను కప్పి తీసుకెళ్లిపోయారు. ఇదిలా ఉండగా తన పొలం వద్దకు తిరిగి వచ్చిన గంగారెడ్డి యూరియా బస్తా కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారిని విచారించాడు. ఇద్దరు యువకులు బైక్‌పై బస్తాను తీసుకెళ్తుండగా తాము చూశామని చెప్పడంతో వెంటనే భిక్కనూరు టోల్‌ప్లాజా వద్దకు చేరుకుని సీసీ ఫుటేజీని పరిశీలించాడు. మక్క కంకుల చొప్పచాటున యూరియా బస్తాను యువకులు తీసుకెళ్తున్న ఫొటోలు తీసుకుని అన్ని సోషల్‌ మీడియా గ్రూపుల్లో షేర్‌ చేశాడు. మరోవైపు యూరియా బస్తాను తీసుకెళ్తున్న యువకులు అంతంపల్లి గ్రామ శివారులో బస్టాండ్‌ వద్ద మూత్ర విసర్జనకు వాహనాన్ని నిలిపారు. అంతలోనే వారి మిత్రులు ఫోన్‌ చేసి మీరు యూరియా బస్తాను ఎత్తుకెళ్తున్నారని సోషల్‌ మీడియాలో ఫొటోలతో సహా వైరల్‌ అవుతోందని సమాచారమిచ్చారు. కంగారు పడిన యువకులు వెంటనే తమ గ్రామస్తులకు విషయాన్ని తెలిపారు. తమ గ్రామానికి వెళ్లి జరిగిన సంగతిని గ్రామపెద్దలకు వివరించారు. వెంటనే గ్రామపెద్దలు ఈ విషయాన్ని రైతు గంగారెడ్డి సొంత గ్రామమైన రామేశ్వర్‌పల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మద్ది సూర్యకాంత్‌ రెడ్డికి వివరించారు. యూరియా బస్తాతో ఇద్దరు యువకులను రామేశ్వర్‌పల్లికి తీసుకొచ్చారు. రామేశ్వర్‌పల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యూరియా బస్తాను పోగొట్టుకున్న రైతు గంగారెడ్డితోపాటు పలువురు నేతలను గ్రామపంచాయతీ వద్దకు పిలిచాడు. యూరియా బస్తాను తీసుకెళ్లిన యువకుడు మాట్లాడుతూ తనకు ఒకే ఒక ఎకరం వరి పొలం ఉందని, పంట చిరుపొట్ట దశకు వచ్చిందని, పది రోజులుగా యూరియా కోసం నానా కష్టాలు పడుతున్నా దొరకలేదని, పంటను దక్కించుకోవాలన్న ఉద్దేశంతోనే ఈ పని చేసినట్టు చెప్పుకుని రోదించాడు. దీంతో రామేశ్వర్‌పల్లి గ్రామస్తులు యూరియాను తీసుకెళ్లిన యువకులను సముదాయించి వదిలిపెట్టారు. నిజాయితీపరులైన యువకులు తప్పుడు పని చేయడానికి యూరియా కొరతే కారణమని ప్రభుత్వంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

- సీపీ సాయి చైతన్య



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీ సాయి చైతన్య

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: ఇంజినీర్‌ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఇంజినీర్లు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నగరంలోని పాలిటెక్నిక్‌ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం, ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం ఇంజినీర్స్‌ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీ సాయిచైతన్య హాజరై మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్‌ విభాగంలో ఉమ్మడి ఏపీతోపాటు దేశానికి విశ్వేశ్వరయ్య చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం భారతరత్న ఇచ్చిందని గుర్తు చేశారు. యువత ట్రాఫిక్‌ రూల్స్‌ పాటించాలని సూచించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం కళాశాల టాపర్లకు గోల్డ్‌మెడల్‌, బిగాల కృష్ణమూర్తి ట్రస్ట్‌ నుంచి రూ.10వేల చెక్కు, సర్టిఫికెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ భారతి, పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి తోట రాజశేఖర్‌, సహ అధ్యక్షుడు కేఎల్వీ రమణ, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ, వినోద్‌, మోహన్‌ కుమార్‌, బాలచందర్‌, బాబా శ్రీనివాస్‌, వై గణేశ్‌, కళాశాల అధ్యాపకులు నాగరాజ్‌, నరేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరాంపూర్‌లో ముదిరిన వివాదం

- ఈత చెట్లు తొలగించిన పలువురి అరెస్టుకు ఎక్సైజ్‌ పోలీసుల యత్నం
- అడ్డుకున్న గ్రామస్తులు.. గ్రామంలో ఉద్రిక్త వాతావరణం
- భారీగా పోలీసుల మోహరింపు

మోర్తాడ్‌(బాల్కొండ): ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో గ్రామస్తులకు గీత కార్మిక సంఘం సభ్యులకు వివాదం ముదిరింది. సోమవారం గ్రామంలో చోటు చేసుకున్న ఉద్రిక్త పరిస్థితి రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో కొందరు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు తమ ప్లాట్‌లలో ఉన్న ఈత చెట్లను తొలగించారు. దీనిపై గీత కార్మికులు ఎక్సైజ్‌ అధికారులకు ఫిర్యాదు చేయడంతో సీఐ గుండప్ప చెట్లు నరికిన వారిని అరెస్టు చేసేందుకు ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎక్సైజ్‌ అధికారులను అడ్డుకున్నారు. తమ సొంత ప్లాట్లలో ఉన్న చెట్లను తొలగిస్తేనే ఇళ్లు కట్టుకోవచ్చని, దీనికి అభ్యంతరం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈత చెట్లు తొలగించడంతో గీత కార్మికుల ఉపాధి దెబ్బతింటుందని సీఐ చెప్పగా గ్రామస్తులు అంగీకరించలేదు. గీత కార్మికులకు భూమి ఉందని అందులో చెట్లు పెంచుకుంటున్నారని, ప్రైవేటు స్థలంలో ఉన్న చెట్లను తొలగిస్తే అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. ఎవరిని అరెస్టు చేసినా ఒప్పుకునేది లేదని పట్టుబట్టి ఎక్సైజ్‌ అధికారులను వాపసు పంపించారు. కాగా, గీత కార్మికులు వారి సంఘ భవనంలో ఉండగా గ్రామస్తులంతా రోడ్లపై నిలబడడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఏర్గట్ల ఎస్సై రాజేశ్వర్‌ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో డివిజన్‌లోని పోలీసులందరినీ తాళ్లరాంపూర్‌లో మోహరించారు. అనుకోని ఘటనలు జరిగితే ఆందోళనకారులను నియంత్రించేందుకు టియర్‌ గ్యాస్‌, ఇతర ఏర్పాట్లు చేశారు. రాత్రి వరకు పోలీసు బలగాలు ఉండటంతో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోలేదు. గ్రామస్తులు, గీత కార్మిక సంఘం సభ్యులు ఇళ్లలోకి వెళ్లినా పోలీసులు మాత్రం పహారా కాశారు.

‘బోను ఏర్పాటు చేస్తాం’



మద్నూర్‌: చిరుత పులి జాడ కోసం గాలిస్తున్నామని, దానిని పట్టుకునేందుకు బోన్‌లు ఏర్పాటు చేస్తామని అటవీశాఖ రేంజ్‌ అధికారి సంతోష తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్‌ కార్యాలయానికి సోమవారం మద్నూర్‌ గ్రామస్తులు, రైతులు తరలి వచ్చి చిరుత పులిని పట్టుకోవాలని తహసీల్దార్‌ ముజీబ్‌కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం తహసీల్‌ కార్యాలయానికి వచ్చిన అటవీశాఖ అధికారులు రైతులతో సమావేశమయ్యారు. పులిని పట్టుకోవడానికి డ్రోన్‌ కెమెరాలను, బోన్‌లను ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్‌ చేశారు. ఈ విషయాన్ని జిల్లా అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్‌ అధికారి సుజాత, బీట్‌ అధికారి రాంచందర్‌, రైతులు బాల్‌కిషన్‌, రాములు, హన్మండ్లు, పరశురాం, అజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

19న విత్తన క్షేత్రంలో పంట ఉత్పత్తుల వేలం

నాగిరెడ్డిపేట: మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో ఈనెల 19న మధ్యాహ్నం పంట ఉత్పత్తులను వేలం వేయనున్నట్లు క్షేత్రం ఏడీఏ ఇంద్రసేన్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తన క్షేత్రంలో విత్తనం కోసం ఉపయోగపడని కేఎస్‌ఎం–1638 సన్నరకానికి చెందిన 492 క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉందని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విత్తన క్షేత్ర కార్యాలయంలో వీటిని వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ.2 వేల డిపాజిట్‌ చెల్లించాలని సూచించారు. వేలం తర్వాత నిర్ధారించిన సొమ్ములో సగం డబ్బులను రెండురోజుల్లో చెల్లించాలని, మిగతా మొత్తాన్ని వారంలో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

క్రైం కార్నర్‌

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని ముదెల్లిలో సోమవారం విద్యుదాఘాతంతో గ్రామానికి చెందిన కౌలు రైతు కర్రోల్ల సాయిలు(52) మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. సాయిలు అదే గ్రామానికి చెందిన ఒకరి పొలం కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం సాయిలు, భార్య లలిత కలుపు తీసేందుకు పొలానికి వెళ్లారు. పొలానికి నీళ్లు పారించేందుకు సాయిలు బోరు మోటారు స్టార్టరు ఆన్‌ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

రైలు కిందపడి ఆత్మహత్యాయత్నం

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌లో రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని రైల్వే పోలీసులు కాపాడినట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. సాలూరా మండలంలోని హాజీపూర్‌కు చెందిన పవన్‌ (28) ఇంజినీరింగ్‌ పూర్తి చేసి నిజామాబాద్‌లో ఉంటున్నాడు. ఆన్‌లైన్‌ బెట్టింగ్‌, మద్యానికి బానిస కావడంతో అప్పులయ్యాయి. అప్పుల బాధలు ఎక్కువ కావడంతో రైలు కిందపడి ఆత్మహత్యకు యత్నించినట్లు చెప్పారు. గాయపడిన పవన్‌ను రైల్వే పోలీసులు ఆస్పత్రికి తరలించారు.

ఇనుము చోరీ కేసులో ఒకరి అరెస్టు



నవీపేట: మండలంలోని యంచ సమీపంలో గోదావరిపై నిర్మిస్తున్న బ్రిడ్జికి వాడే ఐరన్‌ రాడ్లను ఎత్తుకెళ్లిన నిందితుడిని సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. అనూష ప్రాజెక్ట్‌ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బ్రిడ్జికి వినియోగించే ఇనుప రాడ్లను యంచ సమీపంలో నిల్వ చేశారు. యంచ గ్రామానికి చెందిన పీరాజి వ్యాకంటి కొన్ని రోజులుగా ట్రాక్టర్‌లో ఇనుమును దొంగిలించాడని పేర్కొన్నారు. దాదాపు రెండు టన్నుల ఇనుప రాడ్లను దొంగిలించినట్లు తెలిపారు. ప్రాజెక్టు మేనేజర్‌ పార్థసారథి ఫిర్యాదు మేరకు ఈ నెల 10న కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. చోరీకి పాల్పడిన పీరాజి వ్యాకంటిని సోమవారం అరెస్టు చేసి, రెండు టన్నుల ఇనుప రాడ్లను రికవరీ చేశామని ఎస్సై తెలిపారు. చోరీకి ఉపయోగించిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రజాపాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం సలహాదారులు వేం నరేందర్‌ రెడ్డి
- కలెక్టర్‌ టి వినయ్‌ కృష్ణారెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: ఈ నెల 17న నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. వేడుకకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌ రెడ్డి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ముఖ్య అతిథితోపాటు ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌ సూచించారు. వేదిక, సీటింగ్‌ తదితర వాటిపై సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌ కుమార్‌, ట్రైనీ కలెక్టర్‌ కరోలిన్‌ చింగ్తియాన్‌ మావీ, నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్ర కుమార్‌, కలెక్టరేట్‌ ఏవో ప్రశాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

17న స్వస్థనారీ స్వశక్తి పరివార్‌ ప్రారంభం

మహిళల ఆరోగ్యం పెంపొందించేందుకు భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వస్థనారీ స్వశక్తి పరివార్‌ కార్యక్రమాన్ని ఈ నెల 17న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం 17 నుంచి అక్టోబర్‌ 2వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. మహిళల ఆరోగ్యమే ప్రధాన ధ్యేయంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ఆయుష్మాన్‌ ఆరోగ్య మందిరాల్లో సాధారణ ఆరోగ్య శిబిరాలు, ప్రత్యేక నిపుణుల వైద్య శిబిరాలను జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు 10 చోట్ల నిర్వహిస్తారని తెలిపారు. శిబిరాల్లో గైనకాలజీ, చర్మవ్యాధి, దంత, కంటి, మానసిక, పిల్లల వైద్య నిపుణులు పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వ్యాధి నిర్ధారణ, రక్తదాన శిబిరాలు ఉంటాయని తెలిపారు. డీఆర్డీవో, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు క్షేత్రస్థాయిలో మహిళలకు అవగాహన కల్పించి ప్రత్యేక పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌ అంకిత్‌, డీఆర్డీవో సాయాగౌడ్‌, డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీసీహెచ్‌ఎస్‌ శ్రీనివాస్‌ ప్రసాద్‌, జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ శ్రీనివాస్‌ రావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన ఉద్రిక్తం

- పీసీసీ చీఫ్‌ ఇంటి ముట్టడికి యత్నం
- సీఐటీయూ నాయకుల ముందస్తు గృహనిర్బంధాలు
- ధర్నాచౌక్‌ వద్ద అంగన్‌వాడీల నిరసన



టీపీసీసీ చీఫ్‌ ఇంటి ముట్టడికి యత్నిస్తున్న ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

నిజామాబాద్‌నాగారం: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతోపాటు సీఐటీయూ నాయకులు సోమవారం నిర్వహించిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీశాయి. చలో హైదరాబాద్‌కు వెళ్లనున్న అంగన్‌వాడీ టీచర్లు, నాయకులను ఉదయం పోలీసులు గృహనిర్బంధం చేశారు. పలువురిని పోలీసు స్టేషన్లకు తరలించి, అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాగా, జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో పీసీసీ చీఫ్‌ మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ ఇంటి ముట్టడికి అంగన్‌వాడీ కార్యకర్తలు యత్నించారు. సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు పెద్దసంఖ్యలో తరలిరావడంతో పోలీసులు అప్రమత్తమై అడ్డుకున్నారు. కార్యకర్తలు, నాయకులను అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం మిగతా అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నాచౌక్‌ వద్ద నిరసన తెలిపారు. ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, శాంతియుతంగా చేపట్టే కార్యక్రమాలను పోలీసులు అడ్డుకోవడం, అక్రమ నిర్బంధాలు చేయడం సరికాదని అన్నారు. సమస్యల పరిష్కారంపైన చూపాల్సిన శ్రద్ధ నాయకుల అరెస్టులపై పెట్టారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రీ ప్రైమరీ కేంద్రాలను అంగన్వాడీ కేంద్రాలకు కేటాయించాలని డిమాండ్‌ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ. 18వేల వేతనం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే మరో ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు స్వర్ణ, చంద్రకళ, మంగాదేవి, వాణి, విజయ, లక్ష్మి, వసంత, సూర్యకళ, రాజ్యలక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.